KANCHARLA
మనసులో మాట
సంచలన తెలుగు దిన పత్రిక
రాయలసీమ
కర్నూలు | అనంతపురం
చిత్తూరు | కడప
మంగళవారం 14 ఏప్రిల్ 2026


## ధర్మవరం ప్రజలకు ఆర్థిక అండగా

# సీఎం రిలీఫ్ ఫండ్

### - మంత్రి సత్య కుమార్ యాదవ్ చేతుల మీదుగా చెక్కుల పంపిణీ



**ధర్మవరం, ఏప్రిల్ 13 (మనసులో మాట)..** శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలోని ఎన్డీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమం లో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి మరియు ధర్మవరం నియోజకవర్గ శాసనసభ్యులు సత్య కుమార్ యాదవ్ ముఖ్యమంత్రి సహాయ నిధి (జవీ=ఖీ) చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలిచే ఈ కార్యక్రమంలో ధర్మవరం నియోజకవర్గానికి చెందిన మొత్తం 84 మంది లబ్ధిదారులకు రూ. 29,84,037 విలువైన చెక్కులను మంత్రి స్వయంగా అందజేశారు. వైద్య చికిత్సల భారంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు ఈ సహాయం ఎంతో ఉపశమనాన్ని కలిగించింది. ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ, అనారోగ్యం ఎప్పుడైనా, ఎవరికి అయినా ఎదురయ్యే పరిస్థితి అని, అలాంటి సందర్భాల్లో కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం అండగా నిలవడం ముఖ్యమని అన్నారు. ముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా అత్యవసర వైద్య అవసరాలకు తక్షణ సహాయం అందిస్తూ అనేక కుటుంబాలకు భరోసా కల్పిస్తున్నామని తెలిపారు. ప్రజల ఆరోగ్యం, సంక్షేమం ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని ఆయన స్పష్టం చేశారు. వైద్య సేవల విషయంలో ఎవరికీ నిర్లక్ష్యం జరగకుండా అవసరమైన సహాయం అందేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, మాటల్లో కాకుండా చేతల్లో చూపిస్తున్నామని మంత్రి తెలిపారు. కష్టాల్లో ఉన్న ప్రజలకు అండగా నిలవడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తూ, భవిష్యత్తులో కూడా అవసరమున్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సహాయ కార్యక్రమం ద్వారా లబ్ధిదారుల కుటుంబాలకు కొంతైనా ఉపశమనం కలగడం తమకు సంతోషంగా ఉందని మంత్రి పేర్కొన్నారు.



## ప్రజల సమస్యల పరిష్కారంలో

# అలసత్వం వద్దు

### - కలెక్టర్ సుమిత్ కుమార్

**వెదురుకుప్పం, ఏప్రిల్ 13 (మనసులో మాట):** ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించడంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. సోమవారం వెదురుకుప్పం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఆయన ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే వి.ఎం. థామస్‌తో కలిసి పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో రెవెన్యూ సంబంధిత సమస్యలు - మిగతా వార్త 2లో



# అంతా వైసీపీ నేత విజయానందరెడ్డి కుట్ర

- దివ్యజ్ఞాన' భూముల కబ్జాపై ప్రశ్నిస్తున్నందుకే అక్రమ కేసులు
- అక్రమాలను అడిగినందుకే సస్పెన్షన్
- ఏ రాజకీయ పార్టీలో చేరను
- మంచి నేతకు మద్దతు ఇస్తా
- మొదలియార్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బుల్లెట్ సురేష్

మిగతా 4

## న్యాయవాదులకు

# రక్షణ చట్టం అవసరం!

### - రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు వి.ఆర్. రెడ్డి.!



**పలమనేరు ఏప్రిల్ 13 (మనసులో మాట):** న్యాయ వాదులకు రక్షణ చట్టం అవసరమని రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు వి. ఆర్.రెడ్డి అన్నారు. ఇటీవల జరిగిన రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికలలో సభ్యుడిగా ఎన్నికైన వి.ఆర్.రెడ్డి సోమవారం పలమనేరు బార్ అసోసియేషన్ కు విచ్చేశారు. ఈ సందర్భంగా పలమనేరు బార్ అసోసియేషన్ సభ్యులు ఆయన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... నాకు రెండవసారి న్యాయవాదులకు సేవ చేసే అవకాశం కల్పించి రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నుకున్నందుకు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

న్యాయవాదుల సమస్యలు పరిష్కారంలో నేను రాజులేని పోరాటం చేస్తానని న్యాయవాదులకు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. న్యాయ వాదులకు ఇళ్ల పట్టాలు, ఇన్సూరెన్స్, వెల్ఫేర్ ఫండ్, రిటైర్మెంట్ బెనిఫిట్ తదితర అంశాలపై తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ తీసుకురావడానికి తీవ్రంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఇర్షాద్ అలీఖాన్, మాజీ అధ్యక్షులు ఎల్. భాస్కర్, ఉపాధ్యక్షులు, కృష్ణమూర్తి, కోశాధికారి మునిరాజులు, మాజీ ఉపాధ్యక్షులు షేక్ షరీఫ్, చంద్ర శేఖర్, సీనియర్ న్యాయవాదులు పీ. పరమశివప్ప, కె.లక్ష్మీపతి, బి.మోహన్ రెడ్డి,బి.రాజా రెడ్డి, ఎస్. లక్ష్మణ్ రెడ్డి,ఇ.కృష్ణప్ప, ఆరిఫుల్లా ఖాన్,నారాయణ రెడ్డి, ఇబ్రహీం, కె.రంజిత్ కుమార్, అశోక్,మహేశ్వరి,మాధవి ల తో పాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.



## రావులచెరువులో

# వీఆర్ఏపై దాడి

### - నలుగురిపై కేసు నమోదు చేయాలంటూ ఫిర్యాదు


మిగతా 4




# విద్యార్థులు ధర్నా

**నెల్లూరు /గూడూరు( మనసులో మాట ) ఏప్రిల్ 13:** స్థానిక ఎస్. కె. ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు గత ఆరు నెలల నుండి కళాశాల ప్రిన్సిపాల్ ఎం సింహాద్రి నిరంకుశమైన, ప్రభుత్వ వ్యతిరేక చర్యలతో విసిగి ఆందోళన బాట పట్టారు. విద్యార్థులను ఫీజుల పేరుతో ఫోన్లు చేసి బెదిరింపులకు పాల్పడుతున్నాడని, అతని చర్యలతో విసిగిపోయిన వారు ఇంట్లో తల్లి తండ్రులకు తెలిపి ఇదేమిటి అని అడిగితే వారిని నానా దుర్భాషలాడుతూ, డిగ్రీలు ఉచితంగా ఎవరికీ రావు, నేను ఇంతే మీకు దిక్కు వున్న చోట చెప్పుకోండి అని చెపుతున్నారని విధ్యార్థులు లబో దిబో మంటున్నారు. డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఇంటర్న్ షిప్ మార్కులు వేయకుండా రోజూ విద్యార్థులను తిడుతూ వున్నాడు అన్నారు. ప్రభుత్వం నుండి మీకు వచ్చిన ఉపకార వేతనాలు మాకు తిరిగి కట్టేయండి అని బలవంత పెడుతున్నాడు అన్నారు. బడుగు బలహీన వర్గాల దళిత, గిరిజిన విధ్యార్థులను విద్యకు దూరం చేయడమే అతని లక్ష్యం అని బహిరంగంగా పలువురితో చెప్పుకొంటున్నాడు. మా గోడు కనీసం కళాశాల అధ్యాపకులతో చెప్పుకొందామంటే వారితో కూడా ఇలాగే ప్రవర్తిస్తూ వారిని మాటలతో చెప్పరాని విధంగా ఇబ్బంది పెడుతున్నాడు. మహిళా అధ్యాపకులకు సెలవులు ఇవ్వకుండా వారిని కూడా మానసికంగా వేధిస్తున్నాడు. ఇంత దుర్మార్గమైన ప్రిన్సిపాల్ ను ఎంతో చరిత్ర కలిగిన కళాశాల నుండి పంపించి అతని మీద చర్యలు తీసుకోవాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే అతని మీద చర్యలు తీసుకోకపోతే విధ్యా శాఖ మంత్రి లోకేష్ దృష్టి కి తీసుకు వెళ్తామని తెలియజేశారు.

# ప్రజల సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు



- మొదటి పేజీ తరువాయి ఎక్కువగా ఉన్నాయని, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని ఎమ్మెల్యే వి.ఎం. థామస్ కోరారు. మండలంలో వ్యవసాయ అవసరాల కోసం విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ల సమస్య తీవ్రంగా ఉందని గుర్తించి, ముఖ్యమంత్రితో సంప్రదించి 40 ట్రాన్స్‌ఫార్మర్లను ప్రత్యేకంగా మంజూరు చేయించినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. క్షేత్రస్థాయిలో తహసీల్దార్లు, వీఆర్వోలు పారదర్శకంగా పనిచేయాలని, చిన్న సమస్యలను గ్రామ స్థాయిలోనే పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని కలెక్టర్ సూచించారు. మండల స్థాయిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై నివేదికలు సిద్ధం చేయాలని, గతంలో జరిగిన లోపాలు పునరావృతం కాకుండా చూడాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వం వ్యవస్థాగత మార్పుల ద్వారా ప్రజల ప్రయోజనాల కోసం చట్టబద్ధంగా చర్యలు చేపడుతోందని, అధికారులు మరింత వేగంగా స్పందించాలని ఈ సందర్భంగా నేతలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# రావులచెరువులో వీఆర్ఏపై దాడి

## నలుగురిపై కేసు నమోదు చేయాలంటూ ఫిర్యాదు

**ధర్మవరం ఏప్రిల్ 13 (మనసులో మాట)**
శ్రీ సత్యసాయి జిల్లా, ధర్మవరం మండలం రూరల్ పరిధి రావులచెరువు గ్రామంలో వీఆర్ఏ శివానందపై దాడి జరిగిన సంఘటన సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితేడ మూడు నెలల క్రితం జరిగిన పాత విభేదాల నేపథ్యంలో ఈ దాడి జరిగినట్లు సమాచారం సోమవారం సాయంత్రం సుమారు 7 గంటల సమయంలో శివానంద తన ఇంటి వద్ద ఉండగా, గ్రామానికి చెందిన మేకల ఉపేంద్ర, మేకల లక్ష్మయ్య, మేకల నరసమ్మ, మేకల కుమార్ కలిసి కట్టెలతో మరియు రాళ్లతో దాడి చేసినట్లు బాధితుడు ఆరోపించారు. ఈ ఘటనలో శివానందకు గాయాలు కావడంతో చికిత్స కోసం ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు



తెలిసింది.దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనపై పోలీసులు విచారణ చేపట్టినట్లు సమాచారం.

# అంతా వైసీపీ నేత విజయానందరెడ్డి కుట్ర



**చిత్తూరు, ఏప్రిల్ 13 (మనసులో మాట)** చిత్తూరులో సుమారు రూ.150కోట్లు విలువ చేసే దివ్యజ్ఞాన భూముల కబ్జాపై ప్రశ్నిస్తున్నందుకే నాపై అక్రమ కేసులు బనాయించారు. ఇదంతా చిత్తూరు నియోజకవర్గం వైసీపీ ఇన్ ఛార్జి విజయానందరెడ్డి కుట్ర. అక్రమాలను గురించి అగిగినందుకే వైసీపీ వారు నాపై సస్పెన్షన్ వేటు వేశారు. వాస్తవానికి వైసీపీకి నేనే రాజీనామా చేయాలనుకున్నా. భవిష్యత్తులో ఏ రాజకీయ పార్టీలో చేరను. మంచి నేతకు మద్దతు ఇస్తా. మా మొదలియార్లకు అండగా ఉంటా"అని మొదలియార్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు టీజీ సురేష్ అలియాస్ బుల్లెట్ సురేష్ అన్నారు. చిత్తూరులోని తన కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వందేళ్లకు పైగా చరిత్ర కలిగి... సుమారు రూ.150కోట్లు విలువ గల దివ్యజ్ఞాన సమాజం భూమిని వైసీపీ నేత విజయానందరెడ్డి అక్రమ మార్గాల్లో కబ్జా చేస్తున్నాడన్నారు. ఈ అక్రమాల గురించి మీడియాకు తెలిపే రోజునే తనపై ఆరోపణలు చేస్తూ మహిళల వద్ద వీడియో తయారు చేసి.. సామాజిక మాద్యమాల్లో వైరల్ చేశారన్నారు. బాలాజీనగర్ లోని తమ ఇంటిలో 2023 జనవి 10వ తేదీ నుంచి వరుసగా 113గ్రాముల బంగారం దొంగతనం జరుగుతూ వచ్చిందన్నారు. దొంగలు ఎవరో తెలసుకోవడానికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. దీంతో తమ ఇంటిలో పని చేసే విన్నరశీ అని తేలిందన్నారు. సీసీ పుటేజీ ఆధారం చూపి.. ఆమెను ప్రశ్నించగా నేరం అంగీకరించిందన్నారు. పోలీసు కేసు పెడితే.. తన వివాహానికి ఇబ్బంది ఏర్పడుతుందని... మూడు నెలల్లో దొంతగనం చేసిన వస్తువులను ఇచ్చేస్తామని విన్నరశీ, ఆమె కుటుంబ సభ్యులు ప్రాదేయ పడటంతో కొంతకాలం మిన్నకుండి పోయామని బుల్లెట్ సురేష్ చెప్పారు. అయితే గడువు మించి పోయినా దొంగతనం చేసిన వస్తువులు ఇవ్వక పోవడంతో ఈ ఏడాది మార్చి 3వ తేదీన చిత్తూరు రెండవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఇక విన్నరశీ సోదరుడు జాన్సన్ కూడా తమ ఇంటిలో పని చేసే వాడని... అతడు తన భార్య మనోరమ్మను చేతబడి పేరుతో భయపెట్టి 768గ్రాములు బంగారం కొట్టేశాడన్నారు. ఈ విషయమై అతనిని తన కుమారుడు సాయి బాలాజీ (అప్పు) నిలదీస్తే బెదిరింపులకు దిగుతున్నారని బుల్లెట్ సురేష్ చెప్పారు. ఈ జాన్సన్ కు ఓ మీడియా ప్రతినిధి అండగా ఉన్నాడని బుల్లెట్ సురేష్ ఆరోపించారు. వీరికి అండగా వైసీపీ నేత విజయానందరెడ్డి ఉన్నాడన్నారు. విజయానందరెడ్డి ప్రత్యక్షంగా రాకుండా...వెనుక వైపు నుంచి అన్నీ నడుపుతున్నాడని బుల్లెట్ సురేష్ ఆరోపించారు. దివ్యజ్ఞాన సమాజం భూములు ఆక్రమణ చేసి.. విక్రయిస్తుండేది విజయానందరెడ్డేనని అన్నారు. విజయానందరెడ్డికి ధైర్యం ఉంటే ప్రత్యక్షంగా రావాలన్నారు. అలా కాకుండా ఆయన శిఖండిలా వ్యవహరిస్తున్నాడన్నారని బుల్లెట్ సురేష్ విమర్శించారు. దివ్యజ్ఞాన సమాజం భూములు ఆక్రమణపై హైకోర్టులో పిటిషన్ వేశానని... దీంతో చిత్తూరు కలెక్టరుతో పాటు... మరో ఇద్దరికి నోటీసులు జారీ చేశారన్నారు. దివ్యజ్ఞాన సమాజం భూములు ఆక్రమణను అడ్డుకోవడానికి తనవంతు ప్రయత్నం చేస్తున్నానని... రిజిస్ట్రేషన్లు కూడా రద్దు చేయించడానికి న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు. ఇక దళిత గినరిజనులు అంటే తనకు ఎంతో గౌరవమని... తాను కూడా బీసీ కులానికి చెందిన వాడనని... బహుజనుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్నానని ఈ సందర్భంగా బుల్లెట్ సురేష్ గుర్తు చేశారు. ఇక చిత్తూరు వైసీపీ ఇన్ చార్జిగా ఒక అయోగ్యుడు, నీచుడు ఉన్నందున తానే ఆ పార్టీకి రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నానని ఆయన చెప్పారు. అందుకే రెండేళ్లుగా వైసీపీ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నానన్నారు. నిజాలు తెలుసుకోకుండా వైసీపీ అధిష్టానం తనను పార్టీ నుంచి సస్పెండు చేసిందన్నారు. ఈ విషయం వారి విజ్ఞతకే వదలి వేస్తున్నానని బుల్లెట్ సురేష్ అన్నారు. చిత్తూరులో నాయకుడిగా చెప్పకునే విజయానందరెడ్డి వలన చిత్తూరు, పూతలపట్టు, గంగాధరనెల్లూరులో వైసీపీకి కోలుకోలేని నష్టం జరిగిందన్నారు. ఈ నాయకుడు ఉన్నంత వరకు చిత్తూరులో వైసీపీ గెలవదని బుల్లెట్ సురేష్ అభిప్రాయపడ్డారు. ఇక తనపై బనాయించిన కేసుల విషయంలో పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని బుల్లెట్ సురేష్ విజ్ఞప్తి చేశారు. ఈవిలేకరుల సమావేశంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ భాస్కర్, సాయి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## తడి చెత్త పొడి చెత్త వ్యర్థాల కేంద్రానికి

# భూమి పూజ

పలమనేరు ఏప్రిల్ 13( మనసులో మాట): పలమనేరు పురపాలక సంఘ పరిధిలోని గబ్బిళ్ళ కోటూరు నందుగల కంపోస్టు యార్డ్ నందు ఏపీ ప్రభుత్వం స్వచ్ఛ్ ఆంధ్ర కార్పొరేషన్ వారి ఆధ్వర్యంలో తడి చెత్త పొడి చెత్త వ్యర్ధాల శుద్ధి ఏర్పాటు కేంద్రము ను మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి భూమి పూజ చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి మాట్లాడుతూ.... స్వచ్ఛంద కార్పొరేషన్ వారిచ్చే ఈ ప్రొక్యూట్మెంట్ ద్వారా పలమనేరు పురపాలక సంఘం పరిధిలో గల తడి పొడి వ్యర్ధాల నిర్వహణ లయస్ సెక్యూరిటీ గార్డ్ సర్వీస్ (లీడ్ ముంబేర్ ) రఘురాం హ్యామ్ పైప్స్ ప్రైవేట్ లిమిటెడ్ గుంటూరు, హైదరాబాద్ వారిచే నిర్వహించబడుతుందని ఈ యొక్క కార్యక్రమం ద్వారా పలమనేరు పురపాలక సంఘ పరిధిలో తడి చెత్త11 టి పి డి పొడి చెత్త9 టిపిడి మొత్తంగా రోజుకు 20 టన్నులు నిర్వహించి మే 2026 చివరకు పూర్తిస్థాయిలో తడి పొడి చెత్త వ్యర్థాలను శుద్ధి చేస్తామని అందుకు అనుగుణంగా సుమారురూ :1.61 కోట్లు వ్యయంతో నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్ కుమారి శిరీష, సానిటరీ ఇన్స్పెక్టర్ బాబు రెడ్డి నాయక్, పురపాలక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# స్త్రీ శక్తి కార్యక్రమ నిర్వహణ




పలమనేరు ఏప్రిల్ 13( మనసులో మాట) : స్థానిక ఎస్.వి.సి.ఆర్ కళాశాల యందు ఏపీ సి సి ఈ వారి ఉత్తర్వుల మేరకు ప్రిన్సిపల్ డాక్టర్ ఎం వెంకటేసులు ఆదేనుసారం కళాశాల ఆంగ్ల శాఖధిపతి సురేష్ కుమార్ సమన్వయకర్తగా స్త్రీ శక్తి కార్యక్రమ నిర్వహణ జరిగింది. ఈ కార్యక్రమానికి వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నందీశ్వరయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... స్త్రీ సాధికారతలో మూడు దశలు ఉన్నాయని దశల వారీగా దానికి సాధించి సమాజాభివృద్ధిని సాధించాలని ప్రభుత్వం అందించే స్త్రీ సంక్షేమం ద్వారా రాష్ట్రంలోని స్త్రీలు సాధికారత పొందాలని తెలిపారు. డాక్టర్ హేమలత హెచ్వోడి వృక్ష శాస్త్రం మాట్లాడుతూ... మహిళా రిజర్వేషన్ ద్వారా మహిళ సాధికారత సాధ్యమవుతుందని స్త్రీలు అందరూ అవకాశాలు ఉపయోగించుకోవాలని కోరారు. డాక్టర్ వెంకటేష్ బాబు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ మాట్లాడుతూ... దేశ చరిత్రలో మహిళ పాత్ర అమూల్యమైందని కష్టపడిన ప్రతి స్త్రీ అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు గురు ప్రసాద్, హెచ్ ఓ డి ఫిజిక్స్, డాక్టర్ ఈ వాసు, హెచ్ ఓ పి తెలుగు డాక్టర్ అమీర్ భాష, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

# సీఎంకు పోస్టు కార్డు ఉద్యమానికి అపూర్వ స్పందన

**- ఇప్పటికైనా స్పందించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని**

**రైల్వే అండర్ బ్రిడ్జి సాధన కమిటీ కన్వీనర్ రామకృష్ణారెడ్డి, రామమోహన్ హెచ్చరిక**



కడప నగరం ఎర్రముక్కపల్లి - విశ్వనాధపురం మధ్య ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి పెండింగ్లో ఉన్న నిర్మాణాన్ని పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ రైల్వే అండర్ బ్రిడ్జి సాధన కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్యమంత్రి పోస్టు కార్డు ఉద్యమానికి అపూర్వ స్పందన లభించిందని రైల్వే అండర్ బ్రిడ్జి సాధన కమిటీ కన్వీనర్ రామకృష్ణారెడ్డి, రామమోహన్ తెలిపారు. సోమవారం నాడు కడప నగరంలోని విశ్వనాధపురం రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ముఖ్యమంత్రికి పోస్టు కార్డుల ఉద్యమాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేసినా స్పందన లేని కారణంగానే ముఖ్యమంత్రికి పోస్టు కార్డు ఉద్యమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయకపోవడం పట్ల ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకొని నిధులు విడుదల చేసి పెండింగ్లో ఉన్న నిర్మాణాన్ని పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు. ఈ బ్రిడ్జి నిర్మాణం పెండింగ్లో ఉండడం కారణంగా శవాలను తీసుకెళ్లడానికి కూడా తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి కల్పిస్తోందన్నారు.

బాలింతలు, గర్భవతులు, మహిళలు, వికలాంగులు ఈ ప్రాంతం గుండా వెళ్లలేక అష్ట కష్టాలు పడుతున్నారన్నారు. కానీ ఈ ప్రాంత ప్రజా ప్రతినిధిగా ఉన్న ఎమ్మెల్యే స్పందించకపోవడం సమంజసం కాదన్నారు. ఇప్పటికైనా జోక్యం చేసుకొని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

కడప నగరపాలక సంస్థ ఇటీవల ప్రజల నుంచి పెద్ద ఎత్తున పన్నుల రూపంలో నిధులు సమకూర్చుకున్నదని, ఇలాంటి పరిస్థితుల్లో కార్పొరేషన్ సర్వసభ్య సమావేశంలో చేసిన తీర్మానానికి అనుగుణంగా నిధులు విడుదల చేసి సమస్య పరిష్కరించటానికి కృషి చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

లేని పక్షంలో ఈ పోరాటాన్ని మరింత తీవ్రతరం చేయాలని నిర్ణయించినట్టు వారు తెలిపారు.

ఈ కార్యక్రమంలో రైల్వే అండర్ బ్రిడ్జి సాధన కమిటీ నాయకులు నరసింహ, లక్ష్మీనారాయణ, శ్రీరాములు, విజయ భాస్కర్, నాగేశ్వరరావు, భవాని, వరదారెడ్డి, ప్రసాద్ రెడ్డి, కామనూరు శ్రీనివాసులరెడ్డి, చంద్రారెడ్డి, రవి, సుమంత్, అంకమ్మ, విజయమ్మ, సీపీ రమణ తదితరులు పాల్గొన్నారు.

# నారాయణ విద్యా సంస్థ యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలి

**- ప్రైవేటు ఉపాధ్యాయులను వేధిస్తున్న నారాయణ విద్యా సంస్థ పై కేసు నమోదు చేయాలి**

**- డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ డిమాండ్**




జిల్లా లో ప్రైవేటు ఉపాధ్యాయులను వేధిస్తున్న నారాయణ విద్యా సంస్థల యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ డిమాండ్ చేసారు. సోమవారం నాడు కడప లో కలెక్టరేట్ కార్యాలయం నందు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డిప్యూటీ కలెక్టర్ జ్యోతి కి వినతిపత్రం ఇచ్చారు.

ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ నారాయణ విద్యా సంస్థలలో ప్రైవేటు ఉపాధ్యాయులను బానిసలుగా చూస్తున్నారని అన్నారు.మంచి చదువులు చదివి ఉద్యోగ అవకాశాలు రాక ప్రైవేటు ఉపాధ్యాయుల వృత్తిలో చేరితే కార్పొరేట్ విద్యా సంస్థలు ఎక్కువ జీతం ఆశ చూపి తీరా చేరిన తర్వాత వారికి అడ్మిషన్ లు టార్గెట్ విధిస్తూ వేధిస్తున్నారన్నారు.జిల్లా లో 45 డిగ్రీల ఎండలో టీచర్లను ఇంటింటికి ప్రచారాలు నిర్వహిస్తున్నారు. రాను అని అన్నవారికి జీతాలు కట్ చేస్తూ ఇంక్రిమెంట్లు ఉండవని తర్వాత విద్యా సంవత్సరం రావద్దని చెబుతున్నారని అన్నారు.ఉద్యయిగా భద్రత లేక చేసిన అప్పుల కు తప్పని పరిస్థితులలో మనసు చంపుకొని చేస్తున్నారని అన్నారు.ప్రభుత్వం ఒంటిపూట బడులు నిర్వహించాలని చెబుతుంటే కార్పొరేట్ నారాయణ విద్యా సంస్థ విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సెలవులు ఇవ్వలేదన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద 12 నెలలకు ఫీజులు కట్టించుకొని 10 నెలలు మాత్రమే జీతాలు ఇస్తున్నారని అన్నారు.ప్రైవేటు ఉపాధ్యాయుల చేత ఓట్లు వేయించుకున్న ప్రజా ప్రతినిధులు వీరి సమస్యను గుర్తించాలని ప్రభుత్వం తో మాట్లాడి వీరి హక్కుల కోసం మాట్లాడాలన్నారు.నిరుద్యోగులు అయిన ప్రైవేటు ఉపాధ్యాయులు ఉద్యోగ భద్రత చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు.విద్యా శాఖ అధికారులు సైతం పట్టించుకోవడం లేదన్నారు.వారిపై చర్యలు తీసుకోకుంటే ఆందోళన నిర్వహిస్తామని అన్నారు.కార్యక్రమంలో కడప నగర సహాయ కార్యదర్శి వంశీ పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలు వెంటనే తొలగించాలి: సిపిఐ డిమాండ్



**ధర్మవరం, ఏప్రిల్ 15 (మనసులో మాట):** ధర్మవరం పట్టణ పరిధిలోని సర్వే నంబర్ 650-2లో ప్లంబర్స్ మరియు ఎలక్ట్రిషియన్లకు కేటాయించిన రెండు ఎకరాల భూమిని కొంతమంది అన్యక్రాంతం చేసి అక్రమంగా భవనాలు నిర్మించిన ఘటనపై భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. వెంటనే ఆ అక్రమ నిర్మాణాలను తొలగించి కార్మికులకు న్యాయం చేయాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు.

ఈ మేరకు ఈనెల 15 వ తేదీ బుధవారం పట్టణంలోని ఎంఆర్వో కార్యాలయం వద్ద సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించనున్నట్లు సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్లంబర్స్ మరియు ఎలక్ట్రిషియన్ కార్మికులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ విషయాన్ని వెల్లడిస్తూ నిర్వహించిన పత్రికా విలేకరుల సమావేశంలో సిపిఐ పట్టణ కార్యదర్శి పూలశెట్టి రవికుమార్, సహాయ కార్యదర్శి ఎర్రంశెట్టి రమణ, ప్లంబర్స్ అండ్ ఎలక్ట్రిషియన్ కార్మిక సంఘం నాయకులు లక్ష్మీనారాయణ, రామసుబ్బయ్య, సురేంద్ర, చిన్న, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.



## మా ఇంటికి దొంగ పత్రాలు సృష్టించి, లాగేసుకున్నారు

### - జిల్లా కలెక్టర్ కి బాధితుల మొర

**సర్వేపల్లి/పొదలకూరు ఏప్రిల్ 13 (మనసులో మాట)..** నెల్లూరు కలెక్టర్ గ్రీవెన్స్ డే లో బాధితులు నిరసన తెలిపారు. పొదలకూరు మండలం ముఖ్య అధికారుల పై ఎస్సీ ,ఎస్టీ కేసులు పెట్టాలని వారిని సస్పెండ్ చేయాలని కోరుతూ సురాయిపాలెం గ్రామానికి చెందిన కొందరు  నిరసన తెలిపారు. వివరాల్లోకి వెళితే దండే పెంచలమ్మ 1988 లో స్థలం కొనుక్కొని కాలనీ ఇల్లు నిర్మించుకున్నారు. అక్కడే నివాసం ఉండేవారు. ఇటీవల కూలి పనులు కోసం గ్రామం విడిచి వెళ్లారు. కూలి పనులు ముగించుకుని వచ్చి ,కాపురం ఉంటున్న వారిని అక్కడే ఉన్న సమీప బంధువైన వీఆర్ఏ పెంచలయ్య వారి కుటుంబ సభ్యులు దొంగ పత్రాలను సృష్టించి అత్త కోడళ్ళు ఆస్తులు పంచుకున్నట్లు రాసుకుని ఆ పత్రాలను చూపించి, ఇంటిలో ఉంటున్న మమ్మలను బయటకు లాగివేసి, ఇంట్లో ఉన్న సామాన్లను బయట విసిరి పారవేశారు అని జిల్లా కలెక్టర్ కు మొరపెట్టుకున్నారు. ఈ విషయాన్ని బాధితురాలు పొదలకూరు పోలీస్ స్టేషన్లో కంప్లైంట్ ఇచ్చారని, ఎస్సై ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించాడని బెదిరించాడని ఫిర్యాదు లో పేర్కొంది. అనంతరం ఎస్పీ గ్రీవెన్స్ డే లో కూడా కంప్లైంట్ ఇచ్చామని, ఇచ్చిన తరువాత ఎస్సై రాత్రివేళ జీప్ లో కొందరు కానిస్టేబుల్ తో వచ్చి ,మమ్మలను ఇంటిలో ఉండవద్దని బూతులు తిడుతూ బెదిరించాడు అని బాధితురాలు వివరించింది.అదే కాక కలెక్టర్ గ్రీవెన్స్ డే లో ఇంటిని కొలతలు వేసి, ఆ ఇంటిని మాకు ఇవ్వాలని కోరింది. కానీ తప్పు చేసింది రెవిన్యూ డిపార్ట్మెంట్ లోనే పనిచేస్తున్న వీఆర్ఏ కాబట్టి అధికారులందరూ పలుమార్లు కొలతలు వేస్తామని నోటీసులు ఇచ్చి అతనికి వత్తాసు పలుకుతూ మా ఇంటిని కబ్జా చేసేందుకు అందరూ అధికారులు కుమ్మక్కై మమ్మలను బతకనీకుండా చేస్తున్నారని,ఆ అధికారుల పై ఎస్సీ ,ఎస్టీ కేసులు నమోదు చేసి, వారిని సస్పెండ్ చేయాలని జిల్లా కలెక్టర్ కి అర్జీ ఇచ్చారు.

## ఆటోలో మర్చిపోయిన బంగారు ఆభరణాలను 24 గంటల్లో మార్కాపురం గుర్తించిన పోలీసులు



**మార్కాపురం, ఏప్రిల్ 13(మనసులో మాట):** ఆటోలో మర్చిపోయిన బంగారు ఆభరణాలను 24 గంటల్లో మార్కాపురం పోలీసులు గుర్తించి బాధితురాలికి అప్పగించారు. మార్కాపురంలోని చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల నిమిత్తం బొమ్మనబోయిన జ్యోతి అనే మహిళ పుట్టింటికి వచ్చింది. తిరిగి స్వగ్రామం హనుమంతునిపాడు మండలం మల్లవరం వెళ్లే సందర్భంలో బస్టాండుకు ఆటోలో వెళుతూ చీరలతో పాటు రెండున్నర లక్షలు చేసే బంగారాన్ని మరిచిపోయింది. వెంటనే జ్యోతి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. దీంతో గంటల వ్యవధిలో ఆటోను గుర్తించారు. ఆటోలో ఉన్న సొత్తును సీఐ సుబ్బారావు బాధిత మహిళలకు చీరలతో పాటు బంగారాన్ని కూడా అప్పగించారు.

# బాధితులకు న్యాయం చేయడమే లక్ష్యం

### - ఎస్పీ తుషార్ డూడి



**చిత్తూరు, ఏప్రిల్ 13 ( మనసులో మాట):** "ప్రజలు తమ సమస్యలపై న్యాయం పొందేలా పోలీసులు నిబద్ధతతో పనిచేయాలి. ప్రతి ఫిర్యాదును సమగ్రంగా పరిశీలించి, త్వరితగతిన విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయడమే మా లక్ష్యం" అని ఎస్పీ తుషార్ డూడి చెప్పారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన "ప్రజా ఫిర్యాదుల పరిష్కారం" కార్యక్రమంలో ఆయన పాల్గొని బాధితుల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసు అధికారులు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి, వారి సమస్యలను చట్టబద్ధంగా పరిష్కరించాల్సిన బాధ్యతను గుర్తు చేశారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎటువంటి అలసత్వం వహించకూడదని, నిర్దేశించిన గడువులోగా విచారణ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు ఎస్పీతో పాటు, అడిషనల్ ఎస్పీ ఎస్.ఆర్.రాజశేఖర రాజు, చిత్తూరు డీఎస్పీ వెంకట నారాయణను కలిసి తమ వినతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మొత్తం 44 ఫిర్యాదులు నమోదయ్యాయి. వీటిలో భూ తగాదాలకు సంబంధించి అత్యధికంగా 17 ఫిర్యాదులు రాగా, కుటుంబ తగాదాలు 8, పోలీసు సేవలు 6, దారి సమస్యలు 5, ఆస్తి తగాదాలు 3, డబ్బు తగాదాలు 3, ఇతర వేధింపులపై ఫిర్యాదులు వచ్చాయి. ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం చూపి, న్యాయం జరిగేలా చూడటమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని ఎస్పీ పునరుద్ఘాటించారు.

# టిడ్కో గృహాల్లో మౌలిక  వసతులు కల్పించాలి

### - సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి




**నెల్లూరు /గూడూరు (మనసులో మాట ) ఏప్రిల్ 13:** టిడ్కో గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి పేర్కొన్నారు.గూడూరు పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో కి పార్టీ నీ తీసుకువెళ్లి క్షేత్ర స్థాయి లో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పట్టణ , గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వం ను డిమాండ్ చేశారు. కార్మిక , కర్షక , పేదల సమస్య ల పట్ల నిరంతరం సీపీఐ పోరాడుతుందన్నారు. వందేళ్ళుగా ప్రజా సమస్యల పట్ల నిరంతరం సీపీఐ పోరాడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వలన కార్మికులు , కర్షకులు , పేద ప్రజలు తీవ్రంగానష్టపోతున్నారన్నారు. యుద్ధం సాకుతో గ్యాస్ దొరక్క వ్యాపారులు , ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సీపీఐ తోనే ప్రజా సమస్యల పరిష్కారమన్నారు. మే డే ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సి. హెచ్.ప్రభాకర్ , సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శశి కుమార్ , ఏ.ఐ.టి.యు.సి జిల్లా అధ్యక్షులు కొమ్మి నారాయణ , సీపీఐ పట్టణ కన్వీనర్ సునీల్, బి. కె. ఎం. యు నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాసా మూర్తి , తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాలు నివారించడమే మా లక్ష్యం

### - సీఐ రాంభూపాల్



**పలమనేరు ఏప్రిల్ 13( మనసులో మాట):** గంగవరం మండలంలోని వైయస్సార్ జంక్షన్ వద్ద ఇటీవల ప్రమాదాలు జరుగుతుండడంతో దానిని నివారించడానికి గంగవరం సర్కిల్ ఇన్స్పెక్టర్ రాంభూపాల్ ఆధ్వర్యంలో ఆ సర్కుల వద్ద స్పీడా బ్యాకరులు ఏర్పాటు చేయడం జరిగింది. అక్కడ వైట్ పెయింట్ వేయించడం జరిగింది. ఈ ప్రమాదాలను నివారించడానికి జీబ్రా లైన్ కూడా అక్కడ ఏర్పాటు చేశారు. బెంగళూరు- తిరుపతి వెళ్లే వాహనాలు అధికం కావడంతో ప్రమాదాలను పూర్తిగా నివారించడానికి ఆ ప్రాంతంలో సిగ్నల్ లైట్లు, సీసీ కెమెరాలు కూడా హోటల్ వద్ద ఏర్పాటు చేయడం జరిగింది. ఏది ఏమైనా పటికి పూర్తిగా ప్రమాదాలు జరగకుండా చూడడమే మా కర్తవ్యం అన్నారు. అందుకు వేగంగా వచ్చే వాహన దారులు స్పీడా బ్రేకర్ల వద్ద వాహనదారులు గుర్తించి నెమ్మదిగా వెళితే ఎలాంటి ప్రమాదాలు సంభవించవు అని అన్నారు. రోడ్డు పొడవునా ఎర్రటి పైపులు కూడా ఏర్పాటు చేశారు. ఈ పెయింట్ వలన వాహనదారులకు అక్కడ స్పీడ్ బ్రేకర్ ఉన్నట్లు డ్రైవర్లు గుర్తించి నెమ్మదిగా పోవడం జరుగుతుందన్నారు. గతంలో అయితే స్పీడ్ బేకర్లకు పసుపు రంగు ఏర్పాటు చేశారు. దానిపైన తెల్లటి పెయింట్ వేయించడం జరిగిందని గంగవరం సిఐ రాంభూపాల్ తెలిపారు.



# మాజీ మంత్రి కఠారి ఇంట్లో చోరీ

**- కేసును చేదించిన గుడివాడ టు టౌన్ పోలీసులు**

**గుడివాడ, ఏప్రిల్ 13( మనసులో మాట):** చోరీకి పాల్పడిన ముగ్గురు దొంగల అరెస్ట్.... 15 లక్షల విలువైన ఐదు కేజీల వెండి వస్తువులు స్వాధీనం. రికవరీ చేసిన సొత్తు.... దొంగలను మీడియా ముందు ప్రదర్శించిన పోలీసులు. కేసు వివరాలు మీడియాకు వెల్లడించిన ఎస్పీ విద్యాసాగర్ నాయుడు. గత నెల 14 - 18 తేదీల మధ్య గుడివాడకు చెందిన మాజీ మంత్రి కఠారి ఈశ్వరరావు ఇంట్లో చోరీ.. సుమారు 5 కేజీల వెండి అభరణాలను చోరీ చేసిన నిందితులు సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులను అరెస్ట్ చేశామని తెలిపిన ఎస్పీ.. ఇద్దరు మహిళలు సహా, ముగ్గురు దొంగలను పట్టుకున్నాం. చెడు వ్యసనాలకు అలవాటు పడి చోరీలకు పాల్పడుతున్నారూ. ఈ కార్యక్రమంలో గుడివాడ డీఎస్పీ పాలా శ్రీనివాస్, టూ టౌన్ సీఐ హనీష్ , పలువురు అధికారులు పాల్గొన్నారు.

# టీడీపీ ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్ సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



**ధర్మవరం, ఏప్రిల్ 13( మనసులో మాట):** శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరంలో టీడీపీ ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్ సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ధర్మవరం పట్టణం,తాడిమర్రి, ముదిగుబ్బ, ధర్మవరం రూరల్ మండలాలకు చెందిన 14మందికి రూ.5.19లక్షల విలువైన చెక్కులను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా రికార్డ్ స్థాయిలో సీఎంఆర్ఎఫ్ ద్వారా ప్రజలకు సాయం అందుతోంది. ఎన్టీఆర్ వైద్య సేవలు అందని సమయంలో ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్సలు పొంది.. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న వారిని సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆదుకుంటున్నాము.ఈ 22నెలల కాలంలోనే ధర్మవరం నియోజకవర్గంలో 359మందికి 2.34కోట్ల రూపాయల మేర సాయం అందించాము. ఎన్టీఆర్ వైద్య సేవలను మరింత విస్తృతం చేసే విధంగా ప్రభుత్వం ప్రణాళికలు చేస్తోందని శ్రీరామ్ అన్నారు.

## మఠం భూములు ఆక్రమించిన రామ సుబ్బారెడ్డి పై

# చర్యలు తీసుకోవాలి

**- హతి రాంజీ మఠం సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా - నిరంతరాయంగా 8 గంటల ఆందోళన**

**- రామ సుబ్బారెడ్డి అరెస్టు చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తాం - సిపిఎం హెచ్చరిక**



**తిరుపతి, ఏప్రిల్ 13( మనసులో మాట):** తిరుపతి రూరల్ మండలం గాంధీపురం గ్రామపంచాయతీలో సర్వేనెంబర్ 13 లో ఒక ఎకరా తొమ్మిది సెంట్లు చెందిన భూమి 32 మంది గాంధీ పురం వాసులు కొన్న భూమిని ఆక్రమించుకున్న రామసుబ్బారెడ్డి పై కేసు పెట్టి అరెస్టు చేయాలని కోరుతూ నేడు హతి రాంజీ మఠం ఆఫీస్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అక్రమంగా నిర్మించిన గోడ ను కూల్చే వరకు పోరాటం కొనసాగుతుంది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వంద వాసి నాగరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందారపు మురళి మాట్లాడుతూ కొచ్చి శేషగిరిరావు కి, హతి రాంజీ మఠం కు మధ్య భూ వివాదం నడుస్తుందన్నారు. ఈ భూమిని 2014 లో 32మంది కొనుక్కున్నారని అన్నారు. అయితే 2023వ సంవత్సరంలో రామ సుబ్బారెడ్డి అనే వ్యక్తి ఈ భూమి నాది అని దౌర్జన్యంగా ఆ భూములకు ప్రవేశించి కాంపౌండ్ నిర్మించారని తెలిపారు. రామ సుబ్బారెడ్డి పై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ గారికి, రెవిన్యూ వారికి ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదన్నారు. మఠం భూములు ఇప్పటికే అన్యాక్రాంతమవుతున్న కాపాడే నాథుడే లేదని విమర్శించారు. కొనుక్కున్నవారికి వారి స్థలం దక్కే విధంగా తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.రామ సుబ్బారెడ్డి పై చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి మఠం అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. సిపిఎం నేతలు ఎస్ జయచంద్ర, టి .సుబ్రమణ్యం మాట్లాడుతూ రామ సుబ్బారెడ్డి నిర్మించిన అక్రమ గోడను తొలగించాలని, ఆయనపై వెంటనే కేసు నమోదు చేయించాలని కోరారు. ఆక్రమణలకు గురైన మఠం భూములు కాపాడకపోతే సిపిఎం పార్టీ ఆందోళన చేపడుతుందని హెచ్చరించారు. పేదలకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని, అవసరమైతే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. సమస్య పరిష్కారం కొరకు హతి రాంజీ మఠం మహంతులతో చర్చలు చేయడం జరిగింది అనంతరం ఆ స్థలంలో బోర్డు నిర్మిస్తామని రామసుబ్బారెడ్డి పై కేసు నమోదు చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించడం జరిగింది. కార్యక్రమంలో సిపిఎం నేతలు జి.బాలసుబ్రమణ్యం, పి సాయి లక్ష్మి, పి.ముని రాజా, ఎం.నరేంద్ర, బాధితులు మహేష్. ఎలుమలై, రమేష్, నరసింహా, రామ, ధరణి, వరమని, శంకర, మురగ, హరి, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు అండగా కూటమి ప్రభుత్వం

**- మడకశిరలో రూ.30.35 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ**




**శ్రీ సత్య సాయి జిల్లా, ఏప్రిల్ 13( మనసులో మాట):** శ్రీ సత్య సాయి జిల్లా మడకశిర నియోజకవర్గంలో పేదల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజు తెలిపారు. మడకశిర క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి సహాయనిధి (జవీ=ఖీ) చెక్కులను ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మొత్తం 82 మంది లబ్ధిదారులకు రూ.30 లక్షల 35 వేల విలువైన చెక్కులను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, అనారోగ్యం, ప్రమాదాలు, అత్యవసర పరిస్థితుల్లో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను అర్థం చేసుకుని తక్షణ సహాయం అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. కూటమి ప్రభుత్వం పేదల పక్షపాతిగా పనిచేస్తూ ప్రతి నిరుపేద కుటుంబానికి అండగా నిలుస్తుందని ఆయన స్పష్టం చేశారు. చెక్కుల పంపిణీ అనంతరం ఎమ్మెల్యే లబ్ధిదారులతో కలిసి సహపంక్తి భోజనం చేయడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రజలతో మమేకమవుతూ వారి సమస్యలను తెలుసుకోవడం తన బాధ్యతగా భావిస్తున్నానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు, కార్యకర్తలు మరియు లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువస్తున్నాయని పలువురు అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తామని ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజు హామీ ఇచ్చారు.



# తప్పిన పెను ప్రమాదం

## - పత్తికొండ టౌన్ గుత్తి రోడ్డు లో కారు బీభత్సం

**కర్నూలు, ఏప్రిల్ 13( మనసులో మాట):** పాలకేంద్రం వద్ద టీ దుకాణంలోకి దూసుకెళ్లిన కారు, ఒకరికి తీవ్ర గాయాలు తప్పిన పెను ప్రమాదం. పట్టణ శివారులోని గుత్తి రోడ్డు లో పాలశీ తల కేంద్రం వద్ద టీ దుకాణంలోకి దూసుకెళ్లిన కారు. ఒకరికి తీవ్ర గాయాలు. తప్పిన పెను ప్రమాదం. పాల కేంద్రం దగ్గర కర్ణాటకకు చెందిన కారు అతివేగంతో ఢీకొట్టడంతో ఓ కూల్ డ్రింక్ షాపు , పెండ్లి మాన్ తాండాకు చెందిన రేక్య నాయక్ కు తీవ్ర గాయాలు, మూడు ద్విచక్ర వాహనాలు ధ్వంసం, సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకుంటున్న సిఐ జయన్న.

# సంగం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ

## చేసిన జిల్లా లెప్రసి,ఎయిడ్స్, టీవీ అధికారి డాక్టర్ ఖాదర్ వల్లి



**ఆత్మకూరు, ఏప్రిల్ 13( మనసులో మాట):** సంగం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రమును జిల్లా లెప్రసీ ఎయిడ్స్ & టీ బి అధికారి డాక్టర్ ఖాదరవల్లి తనిఖీ చేశారు. పేషెంట్లకు టీబి మందులు సక్రమంగా అందుతున్నాయా లేదా అడిగి తెలుసుకొని టీబి రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న టీ బి ముక్తభారత్ అభియాన్ 2.0 వంద రోజుల ప్రోగ్రాంలో భాగంగా గ్రామాలలో ఉన్న14 సంవత్సరాల దాటిన ప్రతి ఒక్కరికి టీ బి స్క్రీనింగ్ చేసి హ్యాండ్ హెల్డ్ ఎక్రే ద్వారా ఎక్రే తీసి టీబి ఉందో లేదో నిర్ధారించి ఉన్నవారికి ఉచితంగా మందులు అందిస్తామని దీని ద్వారా టీబి వ్యాధిని ఇతరులకు సోకకుండా అరికట్టి టీబివ్యాధిని పూర్తిగా నిర్మూలించవచ్చని తెలిపారు. సంఘం మండలంలో హైరిస్కు పంచాయితీలుగా నాలుగు గ్రామాలు ఎంపిక అయినవని. సంగం1, పెరమణ ,పడమటి పాలెం, దువ్వూరు, గ్రామాలకు ఆరోగ్య సిబ్బంది వచ్చి హ్యాండ్ హెల్డ్ ఎక్రే ద్వారా టీబి ఉందో లేదో నిర్ధారిస్తారని,అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట వైద్యాధికారి అశోక్, సూపర్వైజర్, స్టాఫ్ నర్స్, ఫార్మసిస్టు ఉన్నారు.

# రెవెన్యూ సమస్యలను పరిష్క రించడానికి చర్యలు

## - జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత



మార్కాపురం, జిల్లాలో రాబోయే6 నెలల్లో రెవెన్యూ సమస్యలను పరిష్క రించడానికి చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో 90 శాతం రెవెన్యూ సంబంధించిన అర్జీలు ప్రజల నుండి వస్తున్నాయని అన్నారు. జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటు న్న రెవెన్యూ సమస్య లను పరిష్కరించ డానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామని ఆమె చెప్పారు. జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో 22 (ఏ)లో నమోదైన సర్వే నెంబర్లును తొలగించడానికి ప్రజల నుండి 450 అర్జీలు వచ్చాయని కలెక్టర్ చెప్పారు. జిల్లాలో 21 మండలా లకు చెందిన 150 మంది రైతులకు సంబంధించిన భూములను ప్రత్యేక శ్రద్ధ తీసుకొని 22ఏ లో నుండి తొలగించి ఈరోజు రైతులకు ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని కలెక్టర్ చెప్పారు. జిల్లాలో రైతులకు సంబంధించిన భూములు పొర పాటున 22( ఏ)లో నమోద న్నట్లయితే వారు తమ సచివాల యాల ద్వారా తొలగించడానికి అర్జీలు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఆమె ప్రజలకు చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో 150 మంది రైతులకు సంబంధించిన భూములను 22ఏ నుండి తొలగించి రైతులకు ఉత్తర్వుల కాపీలను జిల్లా కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు, మార్కాపురం రెవెన్యూ డివిజనల్ అధికారి పి. ప్రభాకర్ కనిగిరి రెవిన్యూ డివిజనల్ అధికారి శివరామిరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి బాలు నాయక్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి బాలాజీ నాయక్, జిల్లా రవాణాశాఖ అధికారి రాంబాబు, జిల్లా మహిళాశిశు సంక్షేమ శాఖ అధికారి పద్మావతి , మున్సిపల్ కమిషనర్ నారాయణరావు పాల్గొన్నారు.

# చావైనా, బతుకైనా కరీనగరమే..

- వలసపోవడానికి నేను అవకాశవాదిని కాదు, రేవంత్ రెడ్డిని అంతకంటే కాదు..
- నా తుది శ్వాస వరకు బీజేపీలోనే ఉంటా...
- నేను చనిపోతే నా శవంపై కప్పేది కాషాయ జెండానే..
- ఆ సన్నివేశం చూడటానికైనా రేవంత్ రెడ్డి నిండు నూరేళ్లు బతికి ఉండాలని కోరుకుంటున్నా..
- నా రక్తంలోనే జాతీయవాదమనే డీఎన్ఏ ఉంది...
- వలసవాది, అవకాశవాదానికి ప్రతిరూపం రేవంత్ రెడ్డి..
- పాలమూరు నుండి మల్కాజ్ గిరి దాకా వలస పోయింది రేవంత్ రెడ్డి....



**కరీంనగర్, ఏప్రిల్ 13( మనసులో మాట): :** బండి సంజయ్ సైతం డాక్టర్ లక్ష్మణ్ మాదిరిగా ఏదో ఒక రాష్ట్రానికి వలస పోక తప్పదంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ధీటుగా సమాధానమిచ్చారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. "వలసపోవడానికి నేను అవకాశవాదిని కాదు. రేవంత్ రెడ్డిని అంతకంటే కాదు. చావైనా బతుకైనా కరీంనగరంతోనే... నా రక్తం కాషాయమే. నేను చనిపోతే నా శవంపై కప్పేది కూడా కాషాయ జెండానే. ఆ సన్నివేశం చూడటానికైనా రేవంత్ రెడ్డి నిండు నూరేళ్లు బతికి ఉండాలని కోరుకుంటున్నా"అని పేర్కొన్నారు. ఆ ప్రకటనలో ...

**నేను చనిపోతే నా శవంపై కప్పేది కాషాయ జెండానే..**

సీఎం వలసపోవడానికి నేను అవకాశవాదిని కాదు. రేవంత్ రెడ్డిని అంతకంటే కాదు. నా తుది శ్వాస వరకు బీజేపీలోనే ఉంటా. నేను చనిపోతే నా శవంపై కప్పేది కాషాయ జెండానే. ఆ సన్నివేశం చూడటానికైనా మీరు నిండు నూరేళ్లు బతికి ఉండాలని కోరుకుంటున్నా.

డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల బిల్లులతో జరిగే నష్టమేమిటో చెప్పే దమ్ములేక రాజకీయం చేయాలనుకంటున్నారా? డీలిమిటేషన్ లో భాగంగా ప్రతి రాష్ట్రానికి 50 శాతం సీట్ల పెంచితే దక్షిణాదికి జరిగే నష్టమేంది. ప్రజల్లో లేనిపోని భయాందోళనలు స్రుష్టించి విభజించాలనుకుంటున్నారా? అసలు.... మీరు చెప్పే శాస్త్రీయత ఏమిటి?. డబ్బు సమకూర్చే వాళ్లకే ప్రాధాన్యత ఇవ్వాలని చెబుతున్నారా?. డబ్బుకు, ఓటుకు, సీటుకు లింకు పెడతారా? లక్ష కోట్లు ఉన్న మీ కుటుంబానికి లక్ష ఓట్లు ఇవ్వాలా? డబ్బులేని పేదవాడికి ఓటు హక్కు కల్పించొద్దా?.

మీ లెక్క ప్రకారం...ముంబయికి, ఢిల్లీకి మాత్రమే అత్యధిక సీట్లు ఉండాలా?. వెనుకబడ్డ ఆదిలాబాద్, పాలమూరు జిల్లాలకు సీట్లు పెంచాల్సిన అవసరమే లేదా?. మీ హైబ్రీడ్ మోడల్ అంటే.... మీలాగే, కాంగ్రెస్ పార్టీలాగే దోచుకునే వాళ్లకు మాత్రమే ప్రాధాన్యత ఇవ్వాలా?.మీ పార్టీ సిద్దాంతం ప్రకారం....అంబేద్కర్ రాజ్యాంగాన్ని నమ్ముకున్న మనిషికి విలువ లేదా?. కనీసం మనిషిగా కూడా ఆలోచించలేని స్థాయికి దిగజారుతున్నావా?. కాంగ్రెస్ పార్టీ మిమ్ముల్ని మనీ(ర) మనిషిగా మార్చిందా?. మీలో ఏ మాత్రం మానవత్వం ఉన్నా.....నిజం మాట్లాడండి.

అంతెందుకు.....ఇప్పుడు దక్షిణాది లో ఎన్ని సీట్లు ఉన్నాయి ... ఇది చేసింది మీ పార్టీ నే కదా?. అయినా....ప్రతీది రాజకీయం చేయడం తప్ప మనిషిగా ఆలోచించే తత్వమే మీకు లేదా?. విభజన అనేది మీ పార్టీ డీఎన్ఏ లోనే ఉన్నట్టు ఉంది. విభజించు పాలించు అనే బ్రిటీష్ సిద్ధాంతాన్ని ఒంట బట్టించుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంతకంటే ఏం చెప్పగలరు? రాసుకోవడానికి పేపర్లు, చూసుకోవడానికి టీవీలుంటే సరిపోతుందా?. నేను సవాల్ చేస్తున్నా.....ప్రతి రాష్ట్రానికి 50 శాతం సీట్లు పెంచితే దక్షిణాధికి జరిగే నష్టమేంటి?. జనాభా ప్రాతిపదికన మాత్రమే డీలిమిటేషన్ చేయాలని చెబుతున్నారా?. యూపీఏ సర్కార్ చెప్పిన ఏపీ పునర్విభజన యాక్ట్ ప్రకారం తెలంగాణలో అసెంబ్లీ సీట్ల సంఖ్యను 119 నుండి 153కు మాత్రమే పరిమితం చేయాలా? మీరు చెప్పిన ఆర్థిక (జీఎస్డీపీ) సూత్రం ప్రకారమే డీలిమిటేషన్ చేయాలా?. మీ లెక్క ప్రకారం.... ఈ దేశంలో ఎవరికి ఎన్ని లక్షల కోట్ల ఆస్తి ఉంటే... అన్ని లక్షల ఓట్లు ఇవ్వాలా? తెలంగాణసహా ఈ దేశంలో దళితుడికి, బడుగు, బలహీన వర్గాలకు..... ఇంకా చెప్పాలంటే పేదవాడికి(బీపీఎల్ కుటుంబానికి) ఓటు హక్కే ఇవ్వకూడదా? అసలు... మీరు సీఎంగా ఉంటూ మాట్లాడుతున్నారా? లేక హైకమాండ్ కు ఠంచన్ గా మూటలు అప్పజెప్పే క్రమశిక్షణ కలిగిన వ్యాపార, వాణిజ్య నాయకుడిగా మాట్లాడుతున్నారా?

రేవంత్ రెడ్డి .... ఈ దేశానికి రక్ష, దక్ష డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగమే కదా? రేపు అంబేద్కర్ జయంతి కదా... పుట్టిన రోజే అంబేద్కర్ సిద్దాంతాలను చంపేయాలని చూస్తున్నారా? అంబేద్కర్ బతికినంత కాలం కాంగ్రెస్ పార్టీ ఆయనను అడుగడుగునా అవమానించింది సరిపోలేదనుకుంటు న్నారా? కనీసం అంబేద్కర్ రాజ్యాగంలో ఓటు హక్కు గురించి... డీలిమిటేషన్ గురించి ఏమి రాశారో కూడా చదవలేని స్థితిలో ఉన్నారా? హైకమాండ్ కు మూటలు పంపే టెన్షన్ లో తెలిసి కూడా తెలియనట్లు ఉన్నారా? అని ఘాటుగా విమర్శించారు.